# పుత్రేషణా

కోయకొండ సత్యానంద్

రాఘవయ్యగారంటే నాకు చాలా అభిమానం!

ఆయన టీచరుగా రిటైరయ్యారు రెండేళ్ళ క్రింపట... ఆయన భార్య ఆయన రెండేళ్ళలో రిటైరవుతారనగా పోయారు... ఆయనకు ఇద్దరు పిల్లలు... ఇద్దరికీ పెళ్ళిళ్ళయి ఇద్దరేసి పిల్లలు కూడా ఉన్నారు....

ఇద్దరు కొడుకులూ మా పోర్షనుకు ప్రక్కనున్న రెండు పోర్షన్లలోనూ అద్దెకుంటున్నారు... రాఘవయ్యగారు రిటైరయ్యాక వచ్చిన డబ్బు అప్పటికో ఆయనకున్న అప్పుకు సరిపోలేదు... మిగిలిన అప్పును కొడుకులకు వదిలెయ్యక తప్పింది కాదు... తండ్రిగా ఏ ఆస్తులూ ముట్టచెప్పకపోయినా అప్పును మాత్రం అంటగట్టారు అని పదే పదే అనేవారు కొడుకులు... అయితే నాకొస్తున్న పెన్షనును కూడా మీకే ఇచ్చేస్తాన్లేరా అని వచ్చే పెన్షనును అణా పైసల్తో సహా కొడుకులకే ఇచ్చేయడం మొదలు పెట్టారు రాఘవయ్యగారు... ఇద్దరు కొడుకులూ తండ్రిని పోషించే బాధ్యతను తలోక నెలా పంచుకున్నారు...

అతని కొడుకులకు తగ్గట్టుగానే కోడళ్ళు కూడాను... మావగార్ని అస్తమానం విసుక్కోవడం, ఈసడించుకోవడమూను!

నాకు ఇద్దరూ ఆడపిల్లలే అని అప్పుడప్పుడూ ఆయన దగ్గర బాధపడుతుంటే ఆయననేవారు... 'ఎందుకు బాబూ బాధపడ్తావ్ మగపిల్లలు లేరని... ఆడపిల్లలకైతే తల్లి తండ్రులన్న అభిమానం ఉంటుంది, ఈ మగ వెధవలికి ఆ ప్రేమ ఉండదు నాయనా!' అనేవారు....

'అలా అంటారేమిటండీ, అందరూ ఒకలాగే ఉంటారంటారా?'అన్నానోసారి ... నాకు కొడుకుల పిల్ల అందరినీ ఒక్కలాగే అనుకోవడం అలవాటైపోయింది బాబూ... పుణ్యంకొద్దీ బిడ్డలు నాయనా, నాకూ ఉన్నారు ఇద్దరు...ఎందుకు? తిండి పెట్టటానికే నానా మాటలుఅంటున్నారు... ఏదో ఈ శరీరం మాటల్ని పడీ పడీమొద్దుబారిపోయింది, నా మనసురాటుదేలిపోయింది. ఒక్కడివైతే మాత్రం, నీ తల్లిదండ్రులు ఏనాడో పుణ్యంచేసుకున్నారయ్యా!అందుకే ప్రతీ నెలా ఎన్ని ఇబ్బందులున్నా, మి ఇంటికి పంపాల్సిందిపంపుతుంటావ్!' అన్నారు....

చిన్న చిన్న ఖర్చులకి కూడా ఆయన ఇబ్బంది పడటం చాలాసార్లు గమనించాను... ఏమైనా ఇద్దామన్నా ఆయన చాలా అభిమానం ఉన్న మనిషి... అందుకే నా భార్యతో ఓ ఆలోచన చేసాను...

ఆయనతో ఒకరోజు 'ఎలాగూ మీరు ఖాళీయే కదండీ, మా పిల్లలికి సాయంత్రం పూట ఓ గంట ట్యూషను చెప్పకూడదదండీ?' అన్నాను...

ఆయన అలాగే అన్నారు...

ఒక రోజు మా పిల్లలికి ట్యూషన్ చెప్తూ 'నా మనుమలూ ఉన్నారు, ఒక్కరికీ చదువంటే శ్రద్ధ లేదు... పోనీ దగ్గర కూర్చోబెట్టుకొని చెప్దామన్నా అదేమిటో మీరు చెప్తే వాళ్ళకు అబ్బినట్టే' అని కోడళ్ళు వాళ్ళకు వేరే ప్రైవేట్లు పెట్టించారు....' అని అన్నారు

ఒక నెల గడిచాక 'రోజూ మా పిల్లలికి ఎంతో శ్రద్ధగా ట్యూషన్ చెప్తున్నారు... ఈ డబ్బు ఉంచండి, మీకు ఏ ఖర్చుకైనా పనికొస్తుంది అన్నాను..' ఓ ఏభై రూపాయల నోటును ఆయనకు అందిస్తూ....

ఆయన నోటు వైపు, నా వైపు మార్చిమార్చి చూసి అన్నారు... 'ఇన్నాళ్ళూ నీవు కూడా నా కొడుకే అని అనుకొని మి ఇంటికి వస్తూ పోతూ కాస్తలో కాస్త ఆనందపడుతున్నాను... నీ కూతుళ్ళని నా మనుమరాళ్ళగానే భావించి ఎలాగూ చెప్పమన్నావు కదా అని చెప్తున్నాను.. అందుకు ఖరీదు కడితే ఇంక వాళ్ళకు రేపట్నించి పాఠాలూ చెప్పను, మి ఇంటికీ రాను...' అన్నారు...

ఆ మాటలు విన్నాక నాలో నేనే కాస్త సిగ్గుపడ్డాను నేను చేసిన పనికి...

అలా ఓ రెండు నెలలు గడిచాక....

'రోజూ గంటల తరబడి గొంతు చించుకొని చెప్పడంలో ఏం ఒరుగుతుంది? ఇద్దరు పిల్లలికి ఎంతో కొంత అడిగి పుచ్చుకోగూడదూ, మా పిల్లలికి మేం ప్రైవేటు ఫీజులిస్తున్నాం కదా...' అని అనడం మొదలు పెట్టారు కోడళ్ళు...

నా భార్య రెండు మూడుసార్లు విన్నదట వాళ్ళలా అనడం, నేను కూడా ఒకసారి విన్నాను....

నేను బాగా ఆలోచించి ఒకటో తారీఖున జీతాలందుకొని నా భార్యకు నూరూపాయలు ఇచ్చి రాఘవయ్యగారి కోడళ్ళిద్దరికీ చెరో ఏభై ఇచ్చేయమని చెప్పాను, మా పిల్లల ట్యూషన్ ఫీజు నిమిత్తం....

నా భార్య నేను చెప్పినట్టుగానే చేసింది... ఇద్దరు కోడళ్ళూ ఎంతో సంతోషించారట ఆ డబ్బును చూసి. ..

'వాళ్ళ మాటలు విన్న నేను మీకు బాధ కలుగుతుందని తెలిసినా అలా చేయకుండా ఉండలేకపోయాను... మీరేమి అనుకోకుండా మామూలుగా మా ఇంటికి వస్తూ పోతూ, మా పిల్లలికి ట్యూషన్ చెప్తుండండి' అన్నాను రాఘవయ్యగారితో.

నేను, నా భార్య, చాలాసార్లు చెప్పాకగాని రాఘవయ్యగారు ప్రసన్నులు కాలేదు...

నా భార్య ఆ డబ్బు ఇచ్చిందని మేంచెప్పే వరకూ ఆయనకు తెలియదట... ఆ విషయం ఆ తర్వాత చెప్పారాయన... ఆ తర్వాత అనుకున్నాను అసలా విషయం ఆయనకు చెప్పకుండా ఉండాల్సింది....

నాలుగైదు పెళ్ళిళ్ళున్నాయని ఓ ఇరవై రోజులు సెలవు పెట్టి నేను కుటుంబ సమేతంగా మా సొంత వూరు వెళ్లాను.

ఊరి నుండి వచ్చేసరికి తెలిసిన విషయం ఏమిటంటే... కోడళ్ళిద్దరూ కలసి ఓ పది వీధుల వరకూఉన్న పిల్లల్ని రాఘవయ్యగారి దగ్గర ట్యూషన్‌కిఏర్పాటు చేసారట.... ఇప్పుడీయన ఉదయం,సాయంత్రం నాలుగు బ్యాచ్‌లకి ట్యూషన్లు చెప్తున్నారట...

ఆయనకిప్పుడు నా దగ్గరకు వచ్చి తీరిగ్గామాట్లాడే అవకాశమే కలగడం లేదు... ఇంకా కోడళ్ళిద్దరూ ట్యూషన్లు చెప్పించుకునే పిల్లల కోసం గాలిస్తూనే ఉన్నారు.. ఆయన ట్యూషన్లు చెప్పగా వచ్చే ఆదాయం ఆ రెండు కుటుంబాలకు రెండు సమాన వాటాలవుతుంది....

ఆఫీసు పని మీద మళ్ళీ నాకు ఓ పది రోజుల క్యాంపు తగిలింది... తిరిగి వచ్చేసరికి నాతో నా భార్య చెప్పిన విషయం విని నేను చాలా ఆశ్చర్యపోయాను.

ఆ నెల ట్యూషన్ ఫీజులు వసూలైన తర్వాత అందులోంచి ఒక పంచెల చాపు, పైజమా కొనుక్కోవడానికి కొంత డబ్బడిగారట... దానికి కోడళ్ళిద్దరూ 'మీకు చాలా పంచెలు, పైజమాలు ఉన్నవి కదండీ. ఇప్పుడెందుకు కొనుక్కోవడం అనవసరంగా? ఎలాగూ మరో ఆర్నెల్లలో పెద్ద పండుగ వస్తుంది కదా అప్పుడు తీసుకోవచ్చులే!' అన్నారట...

'అది కాదమ్మా, ఒకటి, అరా తప్ప అన్నీ చిరుగులు పడ్డాయమ్మా... పిల్లలికి ట్యూషను చెప్తున్నప్పుడు అలాంటివి వేసుకుంటే ఏం బాగుంటుందమ్మా, అయినా నేనిలాంటి బట్టలు వేసుకుంటే మీక్కూడా చిన్నతనమే కదమ్మా?' అన్నారట...

ఆ మాట వాళ్ళకు ఎంతో కోపాన్ని తెప్పించినట్టుంది... 'మీరు సంపాదిస్తున్నారని అంత ఖచ్చితంగా మాట్లాడగలుగుతున్నారుగానీ నా వయస్సైపోతుంది, ముందు ముందు నా వల్ల వాళ్ళకు ఎన్నెన్ని ఖర్చులు వస్తాయో అని మాత్రం ఆలోచించి మాట్లాడడం లేదు... ఈ వయస్సులో, మీరెంత సంపాదించి ఇచ్చినా అది మాకేమి మిగిలి పోదులెండి, వచ్చింది వచ్చినట్టే అయిపోతుంది!' అన్నారట....

రాఘవయ్యగారు తర్వాత కోడళ్ళతో ఏమి మాట్లాడకుండా ఆ మర్నాడు ఇద్దరు కొడుకుల్ని పిలిచి... 'ఒరేయ్, ప్రక్క వీధిలో కాంతమ్మ వాళ్ళ తాటాకిల్లు అద్దెకు తీసుకున్నాను... నా ట్యూషన్లు అందులో చెప్పుకొని నా బ్రతుకు నేను బ్రతుకుతాను... ముందు ముందు నా గురించి మీరు ఎలాంటి ఖర్చుల్ని భరించనక్కరలేదు, నా పెన్షనుతో, ట్యూషన్ ఫీజులతో నా బ్రతుకును నేను వెళ్ళదిస్తాను...' అని చెప్పి వెళ్ళిపోయారట...

వెంటనే నేను రాఘవయ్యగార్ని కలిసాను... అప్పుడతను నాతో మాట్లాడిన మాటల్లో ఎంతో బాధ, ఆవేదనకన్పించాయి నాకు.. ఆ ఇంట్లో వాళ్ళ మాటలు అతనిగుండెను ఎంతో నలిపేసాయి... ఇప్పుడే అతనికికొంత ప్రశాంతత ఉందనిపించింది నాకు...

సంవత్సరం గడిచింది...

వస్తున్న డబ్బును చూసి ఆయనకు కన్నెర, అయ్యిందని, అది మిగిలించేసుకుంటామన్న ఆలోచనలతో అలా బయటికి వెళ్ళిపోయారని, ఆయనలా బయటికి వెళ్ళిపోవడానికి పరోక్షంగా మేమే కారణమని, అలా వెళ్ళిపోతే బాగుంటుందన్న సలహా మేమే ఇచ్చి ఉంటామని... చాలాసార్లు అనుకోగా నా భార్య ఆలకించిందట... అడిగేస్తానని, వాళ్ళని కడిగేస్తానని నాతో అందిగానీ నేనే వద్దని వారించాను...

ఆ రోజు నేను రాఘవయ్యగారి దగ్గరకు వెళ్ళాను... ఆయనకు విపరీతంగా దగ్గు వస్తుంది... మనిషి కూడా నీరసంగా కన్పిస్తున్నారు....

"ఒంట్లో బాగుండలేనట్లుంది కదండీ, డాక్టరు దగ్గరకు వెళ్ళలేకపోయారా?' అని అడిగాను...

'వెళ్ళాను నాయనా, ఏవో మందులు రాసిస్తే అవి కొనుక్కున్నాను. అయినా ఇంక పోయే కాలమేగానీ వచ్చే కాలం నాకేముంది?' అన్నారు....

అతని ఆ మాటల్లో జీవితం పట్ల ఎంతో విసుగు ధ్వనించింది... మళ్ళీ ఆయనే అన్నారు...

'ఇన్నాళ్ళూ ఎందుకో బ్రతికానుగానీ ఇంక నాక్కూడా జీవితం మీద విరక్తి కలిగేసింది నాయనా... ఈ తాటాకింట్లో ఒక్కడ్నే పడి ఉండలేకపోతున్నాను... తండ్రిని నేనున్నానని ఒక్కడికీ గుర్తులేదు... చిన్నవాడు అప్పుడప్పుడూ వస్తాడు, ఏదో రెండుమాటలు ముక్తసరిగా మాట్లాడేసి వెళ్ళిపోతాడు కానీ రమ్మని, తనతో ఉండమని అనడు... పెద్దవాడైతే అసలింతవరకూ నా దగ్గరికి రానే రాలేదు... అప్పుడప్పుడూ బజార్లో కన్పిస్తుంటాడు, చూడనట్టు వెళ్ళిపోతాడు.. కోడళ్ళు ఏ మాత్రం పడనిచ్చినా వీళ్ళిలా తయారయ్యేవారు కాదేమో బాబూ! పిల్లలున్నంత వరకూ బాగానే ఉంటుంది, ఎవరూ లేనప్పుడే నాకు అదోలా ఉంటుందయ్యా! అప్పుడప్పుడూ అన్పిస్తుంటుంది, ఈ భూమ్మీద నా ఉనికి ఇంక అనవసరం అని!....

ఆయనలా మాట్లాడుతుంటే నాకు చాలా బాధ కలిగింది... ఎంతో బాధ ఉంటేగానీ ఆ విధంగా ఎప్పుడూ మాట్లాడరాయన...

* * *

ఆ విషయం తెలిసి నేను రాఘవయ్యగారి దగ్గరకు వెళ్ళి అడిగాను...

'అవునయ్యా! ఓపిక ఉండడంలేదు, నేనింక ట్యూషన్లు చెప్పలేను... అందుకే ఇంక రావొద్దని చెప్పేసాను పిల్లలందరితో' అన్నారు.

'ఈ నెల ఫీజులు కూడా తీసుకోలేదట, ఎందుకండీ?' అని అడిగాను.

'ఒక నెలదే కదా తీసుకోనిది... ఫర్వాలేదులే, అయినా మధ్యలో మానేసి వాళ్ళకు ఇబ్బంది కలిగించానుగా?' అన్నారు.

'మరి...'


'ఎలా బ్రతుకుతానననా నీ అనుమానం? పెన్షను వస్తుంది కదా, ఈ వయసులో నాకేమంత అయిపోతుంది.. అదే సరి పుచ్చుకుంటాను...' అన్నారు.

'మందులు వాడుతున్నారా?' అని అడిగాను నేను..

'వాడడం అయిపోయింది.. శారీరకనారోగ్యం ఏమి లేదు నాయనా నాకు...' అని కొడుకుల ప్రవర్తనల గురించి చెప్పుకొని చాలా బాధపడ్డారు...

'...ఏదైనా అవసరం వస్తే సంకోచం ఏమి పెట్టుకోకుండా అడగండి... ఎన్నిసార్లడిగినా కాదన్నారు కానీ మీరు ఇక్కడ ఉండేబదులు మా






విద్యకు విజ్ఞాన సంపాదనయే ప్రధాన లక్ష్యమయినా, కాలాన్నిబట్టి లక్ష్యం మారిపోయింది. ఉన్నతోద్యోగాలు సంపాదించడమే యిప్పుడు స్త్రీ పురుషభేదం లేకుండా అందరూ ఆశించే గమ్యస్థానం. ఐ.ఏ.ఎస్. ఉద్యోగం పరమావధి. దానికి కొంత తక్కువ అయినది ఇంజనీయర్ కావడం, లేదా డాక్టరు కావడం. వాటికి కొంచెం తక్కువయినది బ్యాంకి ఉద్యోగం. తక్కినవేవీ ఉద్యోగాల కిందికి లెక్కకురావు.

అయితే, మొదటి మూడు ఉద్యోగాలకూ మంచి తెలివి తేటలు ఉండాలి. ఆ కోర్సులలో ప్రవేశం లభించడానికి మంచి మార్కులు వచ్చి ఉండాలి. అంతతో సరిపోదు. సీటు సంపాదించడానికి వేలూ, లక్షలూ విరాళాలు ఇవ్వాలి. ఇలా ఇవ్వడానికి శ్రీమంతులకే సాధ్యమవుతుంది. ఒకవేళ తెలివి తేటలు తక్కువయినా– మార్కులు కావలసినన్ని రాకపోయినా విరాళాలు ఎక్కువగా యిస్తే ప్రవేశం తప్పక లభిస్తున్నది. పరీక్షలలో ఉత్తీర్ణులు కావడానికి కూడా తెలివి తేటలు తగినట్లు ఉండక పోయినా– మార్గాంతరాలు ఉండనే ఉన్నవి. ఇలా పరీక్షల్లో కృతార్థులయినవారు బాధ్యతతో కూడిన పదవులను నిర్వహిస్తే పరిణామం ఎలా ఉంటుందో ఊహించ వచ్చును. ఇలాటి ఇంజినీర్లు చేపట్టిన ప్రాజెక్టులు, నిర్మించిన భవనాలు మున్నగునవి దెబ్బ తింటే– నష్టపోయేది దేశం! అంటే దేశంలోని ప్రజలు! ఇట్టి డాక్టర్ల అసమర్థత వలన ప్రాణాలు కోల్పోయేది ప్రజలు! దీనికి ప్రధాన కారణం విరాళాలను బట్టి విద్యాబోధన జరగడం, కోరిన విద్యకు అవకాశం లేకుండా– నిర్బంధంగా– విధిలేక వేరే విద్యను అభ్యసించడం! ఆసక్తిలేని చదువు అంతంతగానే ఉంటుంది- ఈ విషయాన్ని ఉన్నతాధికారులు గమనించవలసి ఉన్నది.

తమకు నచ్చిన విద్యను అభ్యసించినప్పుడే– ఆ విషయంలో విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను చూపడం సాధ్యమవుతుంది. దానివల్ల వాళ్లకే కాకుండా, వాళ్ల మూలంగా దేశానికి కూడా మేలు కలుగుతుంది. శాస్త్ర విజ్ఞానం దిన క్రమంగా విశ్వ వ్యాప్తంగా పెంపొందుతున్న యీ రోజుల్లో ప్రతిభావంతులు తమ సామర్థ్యాన్ని చూపడానికి తగిన అవకాశం ఇవ్వడం ప్రభుత్వ ధర్మం. తక్కిన విషయాల్లో సర్వజనుల పురోభివృద్ధికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నా – విద్యా విషయంలో మాత్రం విరాళాలకు ప్రాముఖ్యం ఇవ్వకుండా, విద్యార్థుల అభిలాషకు, ప్రతిభా సామర్థ్యాలకూ ప్రాముఖ్యం ఇవ్వడం ఎంతో అవసరం!

– బులుసు వేంకట రమణయ్య

ఇంట్లో ఉంటే ఎంతో బాగుండేది... కనీసం ఏదైనా అవసరమైంది సొంత కొడుకుననుకొని అడిగి తీసుకుంటే నాకు ఎంతో సంతృప్తిగా ఉంటుంది...' అన్నాన్నేను.

నా మాటలకు చిన్నగా నవ్వుతూ... 'అలాగేలే నాయనా.. ఆ మాత్రం అభిమానం ఉంది ఈ ముసలాడి మీద... అదే చాలు!' అన్నారాయన.

ఆ తర్వాత మాటల్లో....

'నేను నా కొడుకులికి కొంత అప్పును మిగిల్చేను కదు నాయనా.. అదింకా వాళ్ళు తీర్చలేదని ఆ అప్పులవాళ్ళు నా దగ్గరికి వచ్చారు ఆ ఇంట్లోంచి బయటికి వచ్చాక... అప్పెవరికిచ్చేరో ఆయన్నే అడగండి అన్నారట కోడళ్ళు... అప్పులాళ్ళు నా దగ్గరికి వస్తే ఏదో సర్ది చెప్పి పంపించాను... అప్పట్నించి ట్యూషన్లు చెప్పగా వచ్చిన డబ్బుతో ఆ అప్పును తీర్చేసాను... ఇంక నాకేమి అప్పులేదు, అందుకే ట్యూషన్లు చెప్పడం మానేసాను...' అని చెప్పారు...

మరి కొంతసేపుండి నేను ఇంటికి వెళ్ళొస్తానని

## పుత్రేషణ-

చెప్పి బయల్దేరుతుంటే ఆయన నన్ను ఆపి నా దగ్గరుంచమని నా చేతికి ఓ కవరు అందించారు...

కవర్లో పది వంద రూపాయల నోట్లున్నాయి... ఏమిటన్నట్లుగా ఆయన వైపు చూసాను...

'అప్పులికి పోగా ఇంకా ఈ డబ్బు మిగిలింది...' అని చెప్పారాయన.

'నాకెందుకిస్తున్నారు?'

'ఉంచు బాబూ, అవసరమైనప్పుడు ఇద్దువుగాని..' అన్నారు...

నేను కాదనలేకపోయాను...

ఆ డబ్బు నాకిచ్చినప్పుడు ఆయనన్న ఆ మాటకు అర్థం నాకప్పుడు అర్థం కాలేదుగానీ...

ఆ తర్వాత...

అంటే... ఆ డబ్బు నాకిచ్చిన రెండ్రోజుల తర్వాత రాఘవయ్యగారు పోయినప్పుడు, అతని శవం గుమ్మంలో ఉండగానే తండ్రి అంత్యక్రియల కోసం డబ్బు 'నువ్వియ్యి, నువ్వియ్యి.' 'నేనింతిస్తాను, నువ్వింతియ్యి' అని వాదులాడుకోవడం చూసినప్పుడు అర్థమయ్యింది ఆయన ఆ డబ్బును నాకెందుకిచ్చారో, అవసరమైనప్పుడు ఇద్దువుగాని అని ఎందుకు అన్నారో?

ఆయనా డబ్బు ఇచ్చింది ఇందుకోసమే అని నాకన్పించింది...

అందుకే రాఘవయ్యగారి కొడుకులికి విషయం చెప్పి వాళ్ళకు ఆ డబ్బును ఇచ్చి అతని అంత్యక్రియలు ఘనంగా జరిగేలా చేసాను...

మొత్తానికి రాఘవయ్యగారి జీవితం అలా ముగిసిపోయింది!

'అనవసరంగా మగపిల్లవాడు పుట్టకుండానే ఆపరేషన్ చేయించేసుకున్నాను, మనకో కొడుకు ఉంటే ఎంత బావుణ్ను అని ఎప్పుడూ అన్పించేదండీ ఆ మధ్య... కానీ రాఘవయ్యగారి కొడుకుల్ని చూస్తుంటే ఆ కోరిక క్రమక్రమంగా పోతుందండి...' అని ఈ మధ్య నాతో ఒకసారి అంది నా భార్య....

ఆ మాటలు విన్న నేను చిన్నగా నవ్వి ఊరుకున్నాను! □